ఘనంగా దీపావళి పూజలు



మణికొండ: నార్సింగిలోని విద్యుత్ డీఈ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో దీపావళి పూజలు ఘనంగా నిర్వహించారు. శనివారం జరిగిన పూజా కార్యక్రమంలో సైబర్ సిటీ సర్కిల్ ఎస్ఈ చంద్రశేఖర్ పూజలలో పాల్గొన్నారు. డీఈ రమేష్ చంద్ర, ఏడీఈ రాంబాబు, సీఎస్‌సీ సైదులు, ఈఆర్‌ఓ అకౌంట్స్ అధికారి రాజు, 1104 ఉద్యోగ సంఘం నాయకుడు ఎం. భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ పరిసరాలు శిథిలం



పెద్దతాళ్లకుంట పార్కులో శిథిలావస్థకు చేరిన పరిసరాలు

అత్తాపూర్: పెద్ద తాళ్లకుంటలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఓపెన్ జిమ్‌లో పాడైపోయిన పరికరాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని పదవీ విరమణ పొందిన వరదరాజు నేతృత్వంలో రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. ఎలాంటి అభివృద్ధి లేకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శబరిమలకు పాదయాత్ర



మణికొండ: అయ్యప్ప భక్తులు కాలినడకన శబరిమలలోని అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు బయలు దేరి వెల్లారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో శవిప్రీతం రెడ్డి, మహేందర్‌రెడ్డిలు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడులు కట్టుకుని వెల్లారు. వారి ప్రయాణం సజావుగా సాగి స్వామి వారి దర్శనం పూర్తి చేసుకుని తిరిగి రావాలని గురుస్వాములు రాజేందర్‌గౌడ్, బి.సాయిరెడ్డిలు ఆకాంక్షించారు.

లబ్ధిదారులు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలి

శంషాబాద్: ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుని ఎల్ 1, ఎల్ 2 జాబితో పేరు ఉంటే ఈ నెల 23లోపు మున్సిపాలిటీ కార్యాలయంలో సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ బి. సుమన్‌రావు తెలిపారు. లబ్ధిదారులు ఆధార్ కార్డు, ఇంటి స్థలం ఉన్న దస్తావేజు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు ఇతర ధ్రువపత్రాలు తీసుకురావాలన్నారు.

నేటి నుంచి అయ్యప్పలకు అన్నదానం

మణికొండ: అయ్యప్ప మాలలు వేసుకున్న భక్తుల కోసం ఆదివారం నుంచి అన్నదానం చేపడుతున్నట్లు నిర్వాహకులు కస్తూరి రాములు ముదిరాజ్ తెలిపారు. పుప్పాలగూడ కాశీ విశ్వేశ్వ రాలయం ఆవరణలో నవంబర్ 30వరకు అన్నదానం కొనసాగుతుందన్నారు. గండిపేట మండల పరిధిలోని అయ్యప్పస్వామి భక్తులు అన్నదాన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యుత్ అధికారుల బస్తీబాట

రాయదుర్గం: గోపన్‌పల్లి జర్నలిస్టుకాలనీలో విద్యుత్ అధికారులు బస్తీబాట కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గచ్చిబౌలి విద్యుత్ డీఈ యాదగిరి, ఏఈ భాస్కర్ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది జర్నలిస్టుకాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులకు అడిగి తెలుసుకున్నారు. పలు చోట్ల విద్యుత్ కేబుల్స్ కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు.

జేఎన్‌వీ దరఖాస్తుకు గడువు తేదీ పెంపు

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయలోని 9,11 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకొనే గడువు తేదీని మరోసారి పెంచినట్లు శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని జేఎన్‌విరంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ విజయభాస్కర్ తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఈనెల 23వ తేదీ వరకు గడువును పొడిగించినట్లు వివరించారు. దరఖాస్తు చేసుకున్న వాటిలో మార్పులు చేసుకోవడానికి కూడా అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అందుకోసం ఈనెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు 'కరెక్షన్ విండో' ద్వారా మార్పులను కేవలం ప్రాంతం/లింగం/ వర్గం/ వైకల్యం/పరీక్షా మాధ్యమం వంటి వాటినే మార్పులు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తారని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రాజేంద్రనగర్‌లో బంద్ విజయవంతం



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ తదితరులు



రాజేంద్రనగర్: బీసీ రిజర్వేషన్‌ల కోసం జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో శనివారం బంద్ ప్రశాంతంగా ముగిసింది. రాజేంద్రనగర్ జేఏసీ ఆధ్వర్యంలో అన్ని పార్టీల నాయకులు ఉదయం రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో ముందు ధర్నా చేపట్టారు. బస్సులను బయటికి రాకుండా అడ్డుకున్నారు. దీంతో ఉదయం రహదారులపై రద్దీ కనిపించలేదు. ఆయా ప్రాంతాల్లో దుకాణాలను ఉదయం నాయకులు మూసి వేయించారు. మధ్యాహ్నం 12 గంటల అనంతరం ఆర్టీసీ డిపో నుండి బస్సులను నామమాత్రంగా నడిపి సాయంత్రానికి పూరిస్థాయిలో బస్సులను రూట్లలో తిప్పారు. అఖిల పక్షాల ఆధ్వర్యంలో బంద్ నేపథ్యంలో రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు రాజేంద్రనగర్ సర్కిల్‌లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారులతో పాటు ప్రభుత్వ కార్యాలయాల వద్ద బందోబస్తును ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించారు. ఆరాంఘర్ చౌరస్తా వద్ద ధర్నా చేయడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడటంతో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసుల సమన్వయంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పండుగ నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా తగు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బీసీలకు న్యాయం చేయాలి

రాజేంద్రనగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోరుతూ శనివారం జరిగిన బంద్ విజయవంతమైందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మనోజ్ పండ్ల అన్నారు. బీసీ కులాలతో పాటు బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించి బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొన్నారన్నారు. ప్రధానమంత్రి మోదీ అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి వీలైనంత త్వరగా బీసీలకు న్యాయం చేయాలన్నారు.

అగ్రి వర్సిటీ సిబ్బంది నిరసన

ఏజీవర్సిటీ: బీసీ సంఘాల బంద్‌కు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సిబ్బంది సంపూర్ణ మద్దతు తెలిపారు. సైంటిస్ట్ అసోసియేషన్, నాన్ టీచింగ్ అసోసియేషన్, బీసీ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధికారి డాక్టర్ దామోదరరాజు, నాన్ టీచింగ్ అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.



నార్సింగిలో సీపీఐ నాయకులు



బండ్లగూడ జాగీర్ అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు..



రాజేంద్రనగర్ జూనియర్ కళాశాల వద్ద..



రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో ముందు...



సీపీఐ ఆధ్వర్యంలో...



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బాణాసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి



ఫైర్ ఆఫీసర్ చంద్రనాయక్

అత్తాపూర్: దీపావళి పండుగను పురస్కరించుకొని టపాసులు కాల్చే సమయాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాజేంద్రనగర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ చంద్రనాయక్ కోరారు. దీపావళి పండుగ సందర్భంగా శంషాబాద్, రాజేంద్రనగర్, మైలాదేవ్‌పల్లి, ఆరాంఘర్, అత్తాపూర్, హైదర్‌గూడ, కిషన్‌బాగ్, గగన్‌పహాడ్ తదితర ప్రాంతాల్లో దీపావళి టపాసులు దుకాణాల కోసం 167 మంది దరఖాస్తులు చేసుకున్నారని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ సముదాయాలలో కాకుండా ఓపెన్ ప్రదేశాలలో దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. బాణాసంచా కాల్చే సమయంలో కాటన్ దుస్తులు తలకు టోపీలు కళ్లకు గ్లాసులు ధరించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



మణికొండ: రాష్ట్ర స్థాయిలో జరిగే రెజ్లింగ్ పోటీలలో సత్తా చాటి అత్యధిక పతకాలను సాధించి జిల్లాకు మంచి గుర్తింపు తేవాలని జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ చైర్మెన్ ఆంజనేయులు అన్నారు. శనివారం నార్సింగిలోని వీరాంజనేయ వ్యాయామశాలలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఉత్తమ రెజ్లర్‌లకు పోటీలు నిర్వహించి ఈనెల 21వ తేదీన జియాగూడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాండు, కోశాధికారి, కోచ్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బస్తీలలో జంతువుల వ్యర్థాల పారబోత



శాస్త్రిపురం: ఎక్కడ పడితే అక్కడ జంతువుల వ్యర్థాలను తీసుకువచ్చి పారబోస్తుడంతో శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొద్ది రోజులుగా హసన్‌నగర్, శాస్త్రిపురం, మీరాలం చెరువు, ఇంద్రానగర్ పరసర ప్రాంతాలలో జంతవుల వ్యర్థాలను తీసుకువచ్చి రహదారుల పక్కన వేస్తున్నారు. రాత్రి సమయాలలో ఆటోలు, ట్రాక్టర్లలలో తీసుకువచ్చి పారబోస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. మారలంచెరువు పక్కన ఉన్న సెట్విన్ ప్రాంతంలో రోజూ పదుల సంఖ్యలో ఆటోలలో వ్యర్థాలు పారబోస్తున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



ఏవో సంధ్యరాణికి వినతిపత్రం అందజేస్తున్న పద్మశ్రీకాలనీ వాసులు

బండ్లగూడ: అక్రమంగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లపై అధికారులు చర్యలు తీసుకోవాలని పద్మశ్రీ కాలనీ వాసులు కోరారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్, డిప్యూటీ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్‌లు అందుబాటులో లేకపోవడంతో ఏవో సంధ్యరాణికి అసోసియేషన్ సభ్యులు శనివారం వినతిపత్రం అందజేశారు. పద్మశ్రీ కాలనీలో అనుమతులకు మించి అక్రమంగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవలన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం

మణికొండ: ప్రతి నిత్యం ప్రజలకు తమ సేవలు అందించే మున్సిపల్ కార్మికులకు అండగా ఉంటామని నార్సింగి మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మెన్ జి.వెంకటేశ్‌యాదవ్ అన్నారు. దీపావళి పండగను పురస్కరించుకుని శనివారం మున్సిపల్ కార్మికులకు ఆయన కొత్త బట్టలు, స్వీట్ బాక్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ప్రజలకు అందిస్తున్న సేవలు అమోఘమని, వారికి అన్ని రకాలుగా తాము ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అరుణజ్యోతి, మున్సిపల్ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికులకు బట్టలు పంపిణీ చేసిన మాజీ వైస్ చైర్మెన్, మాజీ కౌన్సిలర్‌లు

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: గగన్‌పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ రవీందర్ తెలిపారు. సెక్షన్ పరిధిలోని గోల్డ్ డ్రాప్ విద్యుత్ ఫీడర్ ప్రాంతంలోని వెంకటేశ్వర కాలనీ, నేతాజీనగర్, సిటాడల్ హోటల్, కాటేదాన్ అండర్ బ్రిడ్జీ ఎడమవైపు భాగంలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు. అత్యవసర సేవల కోసం ప్రజలు 8712470104లో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు పనులు చేపట్టాలి




ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న కవ్వగూడ గ్రామస్తులు

శంషాబాద్ రూరల్: గుంతలమయంగా మారిన కవ్వగూడ రోడ్డు పనులు చేపట్టాలని స్థానికులు శనివారం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌కు విన్నవించారు. స్థానిక నాయకులు కుక్కల బాలు ముదిరాజ్ ఆధ్వర్యంలో రైతులు, ఆటో డ్రైవర్లు, గ్రామస్తులంతా ఎమ్మెల్యేను కలిసి రోడ్డు దుస్థితిపై సమస్యను వివరించారు. శంషాబాద్-షాబాద్ రహదారిలోని ఇందిరానగర్ వద్ద నుంచి కవ్వగూడ వరకు రోడ్డు గుంతలుగా మారిందన్నారు. రోడ్డు అభివృద్ధితో పాటు వీధి దీపాలు ఏర్పాటుకు ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని కోరారు.

లోన్ పేరిట రూ.55వేలు టోకరా

శంషాబాద్ రూరల్: సైబర్ మోసగాడి చేతలో ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు మోసపోయాడు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన మేరకు.. కొత్తూరు మండలం గూడురుకు చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు కాసారం అశోక్‌కు ఈనెల 13న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి.. రూ.10 లక్షల రుణం ఇస్తానని చెప్పాడు. ఇందుకు అంగీకరించిన అశోక్‌ను మాయమాటలతో పలు కారణాలు చెబుతూ తనకు రూ.10 వేలు పంపిస్తే రుణం మంజూరు అవుతుందని నమ్మించాడు. దీంతో రూ.9,850 ఫోన్‌పే ద్వారా పంపించాడు. కొద్ది సేపటి తర్వాత రూ.45,866 మరోసారి పంపాడు. తర్వాత అవతలి వ్యక్తి నుంచి స్పందన లేకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించాడు. శనివారం శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మణికొండ: మూసీనది పక్కనే ఓ కుంటలో కుళ్లి పోయిన దశలో ఉన్న ఓ వ్యక్తి మృతదేహం నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో కనిపించింది. పోలీసులు తెలిపిన మేరకు.. మంచిరేవుల కీర్తి విల్లాస్ వెనక ఉన్న కుంటలో ఓ వ్యక్తి మృతదేహం తేలియాడుతుందని స్థానికులు సమాచారం ఇచ్చారన్నారు. గుర్తు తెలియని వ్యక్తి వయసు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల ఉంటుందని, అతని గురించి చుట్టు పక్కల వారిని అడిగినా ఎలాంటి సమాచారం తెలియలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించామని, మృతుడి సమాచారం తెలిసిన వారు నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో తెలపాలని పోలీసులు కోరారు.

విద్యార్థినిపై లైంగికదాడి.. ట్యూషన్ టీచర్‌కు పదేళ్ల జైలు

రాజేంద్రనగర్: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ ఓ ట్యూషన్ టీచర్‌కు 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ రాజేంద్రనగర్ పోక్సో కోర్టు న్యాయమూర్తి శిక్ష ఖరారు చేశారు. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌గూడ ప్రాంతానికి చెందిన ద్రోణం రాజు సుబ్రహ్మణేశ్వర రావు (59) తన నివాసంలో ట్యూషన్ చెబుతుండేవాడు. ఇతని వద్దకు అదే ప్రాంతానికి చెందిన మైనర్ (13) బాలిక ట్యూషన్‌కు వచ్చేంది. 2017లో నిందితుడు చదువుకునేందుకు వచ్చిన మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడాడ్డు. విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోక్సో కోర్టులో నిందితున్ని హాజరు పరిచారు. సుదీర్ఘ వాదనలు విన్న న్యాయమూర్తి నిందితునికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం అందించాలని ఆదేశించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

శంషాబాద్ : గుర్తు తెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న సంఘటనలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అశోక్ వర్మ తెలిపిన మేరకు.. వికారాబాద్ మల్కాపూర్ గ్రామానికి చెందిన చిన్నకురువ శివకుమార్(21) ఇబ్రహింపట్నం మంగళపల్లిలోని కెన్స్‌టెక్నాలజీ సంస్థలో అప్రెంటీస్ చేస్తూ స్థానికంగా స్నేహితులతో కలిసి నివాసముంటున్నాడు.శనివారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో మెడికల్ షాపులో మందుల కోసం స్నేహితుడితో కలిసి బైక్‌పై శంషాబాద్ వచ్చాడు. తిరుగు ప్రయాణంలో కిషన్‌గూడ ఫ్లైఓవర్ వద్ద గుర్తు తెలియని వాహనం వెనక నుంచి ఢీ కొట్టడంతో గాయాలపాలైన శివకుమార్ అక్కడికక్కడే మృతి చెందగా స్నేహితుడికి స్వల్పగాయాలయ్యాయి. పోస్టుమార్టం నిమిత్తం మతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘరానా దొంగ అరెస్ట్

చందానగర్ : ఇంటి తాళాలు పగలగొట్టి దొంగతనాలు, ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న ఘరానా దొంగను చందానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రెండుద్విచక్రవాహనాలు, 8 గ్రాముల బంగారం, 200 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకుని శనివారం రిమాండ్‌కు తరలించారు. చందానగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తెలిపినమేరకు.. నారాయణపేట్ జిల్లాకు చెందిన భీమేష్ (25) ఇంటి తాళాలు పగులగొట్టి వరుసగా ఇండ్లలో దొంగతనాలు చేస్తూ అంతటితో ఆగకుండా నిత్యం ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తున్నాడు. 2015 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు వివిధ పోలీస్ స్టేషన్‌లలో 42 కేసులలో జైలుకు వెళ్ళివచ్చాడు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ఇంటి దొంగతనం, 2 మోటర్ సైకిళ్ళు, దుండిగల్ పీఎస్ పరిధిలో ఒకే రోజు రెండిళ్లలో దొంగతనాలు, చైతన్యపురి పీఎస్ పరిధిలో ఒక ఇంటి దొంగతనం, హయత్‌నగర్ పీఎస్ పరిధిలో ఒక మోటర్ సైకిల్‌ను దొంగించాడు. మొత్తం 8 దొంగతనాలు చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. ఘరానా దొంగను పట్టుకున్న చందానగర్ క్రైమ్ సిబ్బందిని మాదాపూర్ డీసీపీ, మియాపూర్ ఏసీపీలు అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఐ భాస్కర్, చిత్రంలో నిందితుడు ముద్దంగి భీమేష్